## ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

**శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి**



యువకులతో మాట్లాడుతున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

**శంషాబాద్:** ప్రతి ఒక్కరూ ఓటుహక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో సద్వినియోగం చేసుకోవాలని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి సూచించారు. పట్టణంలోని సాతంరాయిలో గురువారం సాయంత్రం పోలీసుల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో డీసీపీ నారాయణరెడ్డి యువతతో మాట్లాడారు. శాంతియుత వాతావరణలో పోలింగ్ జరిగేలా యువత సహకరించాలన్నారు. అదనపు డీసీపీ రామ్‌కుమార్, ఏసీపీ శ్రీనివాస్, సీఐ బాలరాజు తదితరులున్నారు.

# వాతావరణ మార్పులకనుగుణంగా వంగడాలు

**ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టీ.ఆర్ శర్మ**



మొక్కజొన్నలో నూతన ఆవిష్కరణలతో అధికారులు

**ఏజీవర్సిటీ:** భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా అధునాతన టెక్నాలజీని వినియోగించుకుంటూ.. వాతావరణ మార్పులను తట్టుకునే వంగడాలను ఉత్పత్తి చేసి ఉత్పాదకతను అధికం చేయాల్సిన అవసరం ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్)డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టీ.ఆర్ శర్మ సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో భారత మొక్కజొన్న పరిశోధన సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 67వ మొక్కజొన్న పరిశోధన కేంద్రాల వార్షిక సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా మొక్కజొన్న విషయంలో దేశం సాధించిన ప్రగతి అపూర్వమని కొనియాడారు.

- మొక్కజొన్న ముడి పదార్థంగా ఇథనాల్ సహా అనేక ఉత్పత్తులు తయారవుతున్నాయన్నారు. తగ్గుతున్న భూ నీటి వనరులు, వాతావరణ మార్పులు పెరుగుతున్న డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని ఉత్పత్తి ఉత్పాదకతను పెంపొందించేందుకు శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించాలన్నారు.
- డ్రోన్లు, శాటిలైట్లు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అధునాతన టెక్నాలజీని విరివిగా ఉపయోగించాలన్నారు.
- పరిశోధన సంస్థలు ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమలు పరస్పర సహకారం, సమన్వయంతో పని చేయాలని సూచించారు.
- విలువ జోడింపు మార్కెట్ అనుసంధానాలపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు.



పంటలో ప్రతిభ కనబరిచిన రైతులను సన్మానిస్తున్న దృశ్యం

**165 దేశాల్లో ప్రపంచ పంటగా..**

సుమారు 165 దేశాల్లో సాగవుతున్న మొక్కజొన్న ప్రధాన ప్రపంచ పంటగా గుర్తింపు పొందిందని వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో మొక్కజొన్న ప్రధాన పంట అని, ప్రాంతాలవారీగా ఉత్పత్తి ఉత్పాదకతల్లో అంతరాలు ఉన్నాయని వివరించారు. నీటిఎద్దడి, చీడపీడలు, భూసార క్షీణత మార్కెట్‌కి సరైన అనుసంధానం లేకపోవడం వల్ల మొక్కజొన్న రైతులు సవాళ్లని ఎదుర్కొంటున్నారని వాటిని అధికమించడానికి సమీకృత ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రస్తుతం బేబీకార్న్, స్వీట్‌కార్న్‌లకు ఆదరణ పెరుగుతుందని, సేంద్రియ సహా వ్యవసాయ విధానాల వల్ల ఈ రకాల మొక్కజొన్న సాగుకి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.

- మొక్కజొన్న పంట సాగులో ప్రతిభ కనపరిచిన రైతులు, ఎఫ్‌పీఓలను ఘనంగా సన్మానించారు. ఐసీఏఆర్ అసిస్టెంట్ జనరల్ ఎస్‌కె. ప్రదాన్, భారత మొక్కజొన్న పరిశోధన సంస్థ డైరెక్టర్ హెచ్.ఎస్. జాట్, నోడల్ అధికారి రమేష్‌కుమార్, విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు, వివిధ ఐసీఏఆర్ సంస్థల సంచాలకులు ప్రైవేటు సంస్థల ప్రతినిధులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేపీతోనే దేశ ప్రగతి

**– కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి**



నారిశక్తి కార్యక్రమంలో పాల్గొన్న నాయకురాలు

**రాజేంద్రనగర్:** బీజేపీతోనే దేశ ప్రగతి సాధిస్తుందని చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీతారెడ్డి అన్నారు. గురువారం నారిశక్తి కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లతో సమావేశమై ప్రజల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధిని తీసుకెళ్లి కమలం గుర్తుకు ఓటువేసేలా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దేశం యావత్తు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ప్రజలు మరోసారి కోరుకుంటున్నారన్నారు. తమ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.వనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యం



కాంగ్రెస్‌లో చేరిన స్థానిక నేతలతో రంజిత్‌రెడ్డి



రంజిత్‌రెడ్డి నివాసంలో..



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి



ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నేతలు

**రాజేంద్రనగర్:** రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కోరని బాలరాజు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజుల్లో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందన్నారు. బుద్వేల్‌లో గురువారం నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంటు పరిధి అభివృద్ధి చెందాలంటే అది రంజిత్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. నాయకులు కోరని శ్యామ్, నరేందర్, పెండ్యాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

**శంషాబాద్:** పట్టణంలోని సాతంరాయికి చెందిన బీఆర్ఎస్ నేతలు పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. గురువారం పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు నరేందర్, పట్టణ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్, రెండో వార్డు కౌన్సిలర్ భద్రునాయక్ ఆధ్వర్యంలో మొత్తం 70 మంది చేవెళ్ల పార్లమెంటు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్లలో రెండు లక్షల భారీ మెజార్టీలో కాంగ్రెస్ గెలవబోతుందన్నారు. ప్రతి కార్యకర్తల సంక్షేమానికి పార్టీ కట్టుబడి ఉంటుందన్నారు. మాజీ ఉపసర్పంచ్‌లు మల్లేష్, చందర్‌నాయక్, నాయకులు పోతుగంటి యాదయ్య, జగదీష్, జంగయ్య, మల్లారెడ్డి, నర్సింగ్‌రావు, తరుణ్ తదితరులున్నారు.

**బండ్లగూడ:** కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో గురువారం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలుసుకుని చేతి గుర్తుకు ఓటువేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ నాయకులు కె.సత్యనారాయణ గౌడ్, బి.నారాయణ స్వామి, శేఖర్‌గౌడ్‌లు గురువారం కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు దేవదాస్‌గౌడ్, రాపోలు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం**

**మణికొండ:** ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఎంపీగా డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ అన్నారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గంపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండి పిలిస్తే పలికే నాయకుడిగా పేరు ఉన్న రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**మణికొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు, కార్యక్రమాలు ఎంతో గొప్పవని మణికొండ మున్సిపల్ కౌన్సిలర్ లావణ్యనరేష్ అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకు ఓటు వేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.



మణికొండలో ఇంటింటి ప్రచారంలో కౌన్సిలర్ లావణ్యనరేష్

## పోలింగ్ స్టేషన్ పరిశీలన



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

**బండ్లగూడ:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని పోలింగ్ స్టేషన్‌లను గురువారం ఆయన పరిశీలించారు. కిస్మత్‌పూర్ ప్రభుత్వ పాఠశాల, బండ్లగూడ ఎంపీపీఎస్ స్కూల్, శివాజీ యూత్ బిల్డింగ్, వార్డు కార్యాలయం, కాళీమందిర్ ప్రభుత్వ పాఠశాల, అభ్యుదయనగర్ కమ్యూనిటీహాల్, దర్గా, హిమాయత్‌సాగర్ ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శానిటేషన్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత శానిటరీ జవాన్లను ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు జగన్, సురేష్, శ్రీధర్, నరేందర్, తౌఫిక్, యాదగిరి, సుభాష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## నేర్చుకోవడం నిరంతర సాధనగా మారాలి

**హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి**





**శంషాబాద్:** నేర్చుకోవడమనేది నిరంతర సాధనగా ఉండాలని, మార్పులు స్థిరమైనవిగా ఉండాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి విజయ్‌సేన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాముఖ్యతను ఇచ్చిన దేశాలే ఎక్కువగా అభివృద్ధి చెందాయన్నారు. ప్రస్తుతం దేశంలో విద్యారంగం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకెళ్తుందన్నారు. పట్టణంలోని అకాంప్లిష్ అకాడమీని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో దిశా నిర్దేశం చేస్తూ మాట్లాడారు. విద్యారంగంలో మౌలికవసతుల కల్పన కూడా ఎంతో ప్రదానమైందన్నారు. బలవంతంపు చదువులు కాకుండా భవిష్యత్తును నిర్దేశించుకునే ఎంపికతోనే చదువును ముందుకు కొనసాగించాలన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, విద్యావేత్త కొండల్‌రెడ్డి, కార్డియాలజిస్ట్ హన్మంతురెడ్డి, సంస్థ చైర్మన్ బుచ్చిరెడ్డి తదితరులున్నారు.

## పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామగ్రి



ఎన్‌సీసీ గ్రౌండ్‌లో షామియానాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**రాజేంద్రనగర్ :** నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామగ్రితో పాటు సిబ్బందిని తరలించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వెటర్నరీ కళాశాల ఎన్‌సీసీ గ్రౌండ్ నుంచి పోలింగ్ బూత్‌లకు తరలించేందుకు తగిన ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. గురువారం ఉదయం నుంచే గ్రౌండ్ షామియానాలను వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలింగ్ ఈవీఎంలతో పాటు సామగ్రిని అందించేందుకు ఒక ప్రాంగణాన్ని, భోజనాలు చేసేందుకు మరో ప్రాంగణం, పార్కింగ్ కోసం ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, ఫ్యాన్లను సిద్ధం చేస్తున్నారు. 47 రూట్లలో 543 పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామగ్రిని తరలిస్తారు. ప్రతి రూట్‌కు సెక్టోరల్ ఆఫీసర్‌ను నియమించారు. సెక్టోరల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో బూత్‌ల వారీగా సామగ్రి తరలనుంది. 47 రూట్లకు బస్సులను సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం నుంచే ఎన్నికల సామగ్రిని ఎలాంటి అవరోధాలు లేకుండా పోలింగ్ బూత్‌లకు తరలించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేపడుతున్నారు.

## రంజిత్‌రెడ్డి విజయానికి కృషి చేస్తాం



**శంషాబాద్:** చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయానికి సీపీఎం సర్వశక్తులొడ్డుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె. భాస్కర్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ వస్తే రాజ్యాంగాన్ని మార్చడంతో పాటు రిజర్వేషన్లను రద్దు చేస్తారని ఆరోపించారు. సీపీఎం జిల్లా నాయకులు నీరటి మల్లేష్, జగదీష్, శ్రీనివాస్, కురుమయ్య, ప్రణయ్, పవన్ తదితరులున్నారు.

## వేర్వేరు ఘటనల్లో మద్యం పట్టివేత

**148 బాటిళ్లు సీజ్**

**శంషాబాద్ రూరల్:** అక్రమంగా మద్యం నిల్వ చేసిన వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 148 బాటిళ్లు లభ్యమయ్యాయి. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాచారం–జూకల్ రోడ్డుపై గురువారం జూకల్ వాసి కోడూరు శ్రీకాంత్ అక్రమంగా మద్యం సీసాలతో ఉన్నాడు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. పోలీసుల తనిఖీల్లో 96 విస్కీ బాటిళ్లు బయటపడ్డాయి. నిందితుడిని అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

**మరో ఘటనలో..**

మండలంలోని అలీకోల్‌తండాకు చెందిన కేతావత్ మను ఇంట్లో అక్రమంగా పెద్ద ఎత్తున మద్యం సీసాలను నిల్వ చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. 52 విస్కీ బాటిళ్లు లభించాయి. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓటుహక్కుపై అవగాహన



షాదాన్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

**బండ్లగూడ:** ఓటు అనే ఆయుధాన్ని ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించుకోవాలని 'సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ' (స్వీప్) నోడ్ ఆఫీసర్, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. పార్లమెంట్ ఎలక్షన్–2024 స్వీప్ కార్యక్రమంలో భాగంగా 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' అనే థీమ్‌తో షాదాన్ మెడికల్ కళాశాలలో సిబ్బందికి ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. చదువుకున్న వారే ఓటు వేయడం లేదని, ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకుని ప్రజాస్వామ్యానికి గట్టి పునాదులను నిర్మించాలని సూచించారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, కళాశాల డీన్ డాక్టర్ సుశీల్, డాక్టర్ మహమ్మద్‌సిద్ధిఖ్‌ఖాన్, ఓఎస్‌డీ జనార్దన్‌రెడ్డి, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీతోనే దేశాభివృద్ధి



ఇంటింటి ప్రచారంలో బీజేపీ సీనియర్ నేత శీలం తిరుపతిరెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి:** దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని రాజేంద్రనగర్ సర్కిల్ సీనియర్ బీజేపీ నాయకులు శీలం తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం గగన్‌పహాడ్ బస్తీలో చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా నమూనా బ్యాలెట్ పేపర్లను ప్రజలకు పంపిణీ చేస్తూ.. కమలం గుర్తుకే ఓటు వేయాలని కోరారు. అనంతరం శీలం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లు దేశాన్ని పాలించిన బీజేపీకి మూడోసారి అవకాశం కల్పిస్తే దేశం మరింత పురోగతి సాధిస్తుందన్నారు. భారతదేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి దేశానికి ఉపయోగపడేలా చేయాలన్నారు. బీజేపీపై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని వారి మాటలను నమ్మకుండా దేశ భవిష్యత్తు కోసం బీజేపీకి ఓటువేసి హ్యాట్రిక్ విజయానికి పునాది వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకుడు జోగి రవి, సూరెడ్డి వినయ్‌రెడ్డి, తలారి చిన్నా, వల్లూరి శ్రీనివాస్,చిన్నా, నందు, వినయ్, నాగేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**గడపగడపకు ప్రచారం..**

**శంషాబాద్ రూరల్:** మండలంలోని సుల్తాన్‌పల్లి గ్రామంలో బీజేపీ నేతలు గడపగడపకు ప్రచారం నిర్వహించారు. చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు ఓటర్లను కోరారు. చేవెళ్ల గడ్డ మీద కాషాయ జెండా ఎగురవేయాలన్నారు. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ప్రేమ్‌రాజ్, వెంకటయ్య, చంద్రయ్య, లక్ష్మయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

**రాజేంద్రనగర్:** గగన్‌పహాడ్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేవైఎం అధ్యక్షులు సూరెడ్డి వినయ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అందించలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రపంచ దేశాలతో భారత్ నేడు పోటీ పడుతుందంటే అది బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. నరేంద్ర మోదీని మరోసారి ప్రధానమంత్రిగా చేసేందుకు దేశ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బీజేపీలోకి చేరికలు**

**శంషాబాద్:** శంషాబాద్ పట్టణంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి పలువురు కార్యకర్తలు, యువకులు బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా సమక్షంలో ఆర్బీనగర్, కొమటిబస్తీ, రెడ్డిబస్తీ, జెండా చౌరస్తా నుంచి సుమారు 200 మందిని పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సూచించారు. బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తదితరులున్నారు.

**కొండా గెలుపును ఆపలేరు..**

**అత్తాపూర్ :** బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరని బీజేపీ నాయకులు అన్నారు. గురువారం చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలో బూత్ నంబర్ 207, 208 బూత్‌లలో ఓటర్ స్లిప్పులను పంచుతూ.. ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ.. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.



బీజేపీలో చేరిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు

# బీసీలు ఐక్యతతో కాసానిని గెలిపించుకోవాలి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**మైలార్‌దేవ్‌పల్లి :** బీసీలు ఐక్యత కోసం పోరాడే వ్యక్తిని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి బీసీ సోదరులకు ఉందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లిలోని దుర్గా కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. బీసీల ఐక్యత కోసం అనేక ఏళ్లుగా పోరాడిన వ్యక్తి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీసీ కులాలపై కాంగ్రెస్‌నేత మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. డబ్బులకు బీసీలు లొంగుతారనే వ్యాఖ్యలకు బీసీ సంఘాలు ఏకమై ఓటు ఆయుధంతో దెబ్బ కొట్టాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు.

**మణికొండ:** 96 బీసీ కులాలను ఒక్కతాటిపైకి తెచ్చి వారి అభ్యున్నతికి ఉద్యమించిన బీసీ ఉద్యమ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను రాబోయే ఎన్నికల్లో ఎంపీగా గెలిపించాలని నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రవీణ్‌యాదవ్ అన్నారు. గురువారం ఆయన మంచిరేవులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, ఎమ్మెల్సీగా ఆయన జిల్లా అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. అలాంటి వ్యక్తి సేవలను గుర్తించి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఎంపీ టికెట్ ఇచ్చారని, ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి బీఆర్ఎస్ నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో విఫలం కావటంతో ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అధికారాన్ని అనుభవించి పార్టీ ఫిరాయించిన రంజిత్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పద్మశాలిపురంలో ప్రచారం చేస్తున్న ప్రేమ్‌గౌడ్



ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ నేతలు

**బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం..**

**మైలార్‌దేవ్‌పల్లి:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నేరవేర్చడంలో విఫలమైందని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ప్రేమ్‌గౌడ్ అన్నారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురంలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాశిగారి యాదగిరి, జయప్రకాష్, వెంకటేష్, మహేష్‌రాజ్, ఎల్లప్ప, గుర్రం బాల్‌రాజ్, రామయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**రాజేంద్రనగర్:** అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు వనం శ్రీరాంరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ 3 నెలల పాలన పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు.